కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 21, దొండ 18, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 31, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 27, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటి కాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ప్రశాంతంగా ముగిసిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్-2025 ప్రశాంతంగా ముగిసినట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. పీహెచ్‌డీ కేటగిరీ-2లో ప్రవేశాలకు ఈ నెల 25, 26, 27 తేదీలలో జరిగిన పరీక్షలకు 9747 మంది దరఖాస్తు చేసుకోగా 7903 మంది అభ్యర్థులు (81.08శాతం) హాజరైనట్లు తెలిపారు. మే 1న ప్రథమిక కీని, చివరి వారంలో ఫలితాలను విడుదల చేయనున్నట్లు చెప్పారు.

పోతరాజు వేంకటేశ్వర్లుకు ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ చరిత్ర విభాగం విద్యార్థి పోతరాజు వేంకటేశ్వర్లకు చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. చరిత్ర విభాగం అధ్యాపకులు డా.రమేష్ పర్యవేక్షణలో తెలంగాణ ఉద్యమంలో మాదిగల పాత్ర అనే అంశంలో పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వెంకటేశ్వర్లు గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు.

వంజరి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



సంఘం సమావేశంలో పాల్గొన్న నాయకులు

లాలాపేట: తెలంగాణలోని వంజరి కులస్తుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలనీ తెలంగాణ వంజరి సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తార్నాకలోని వంజరి సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం తెలంగాణ వంజరి సంఘం సమాలోచన సమావేశాన్ని నిర్వహించారు. సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కాలేరు విశ్వనాథం మాట్లాడుతూ వంజరి కులస్తులు కోల్పోయిన ఎస్టీ రిజర్వేషన్‌ను తెలంగాణలో పునరుద్ధరించాలన్నారు. ఉప్పల్ బాగాయత్‌లో తెలంగాణ వంజరి ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం వెంటనే నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం మాజీ అధ్యక్షులు సాల్వేరు ముత్తయ్య, మైసరి మాణిక్ ప్రభు పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పది



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత

లాలాపేట: లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమవాస్యను పురస్కరించుకుని లాలాపేటలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లాలపేట అర్యవైశ్య సంఘం శాశ్వత అధ్యక్షులు నేతి రాములు, అధ్యక్షులు మడిపడగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలను నియమించండి



బీసీ నేత జాజుల లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: నామినేటెడ్ పదవుల్లో బీసీలను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆదివారం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీసీలు ఎంతో కృషిచేశారని పాలన పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలు ద్వితీయ శ్రేణి నాయకులుగానే ఉంటున్నారని సీనియర్లకు పదవుల్లో అవకాశం కల్పించి ప్రోత్సహించాలన్నారు. ఖాళీగా ఉన్న సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కమీషనరుగా బీసీని నియమించాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉండాలన్నారు.

ఆటల పండుగ వచ్చేసింది..

45 రోజుల పాటు వేసవి క్రీడా శిక్షణ సంబురం.. ● మే 31 వరకు క్రీడోత్సవం







సనత్‌నగర్: వేసవి సెలవుల జోష్ మొదలైంది. నిన్నమొన్నటి వరకు పుస్తకాలతో కుస్తీపట్టిన చిన్నారులు ఇక మైదానాల్లో తమకిష్టమైన క్రీడల్లో సందడి చేయనున్నారు. ప్రతియేటా లాగానే ఈ సారి కూడా జీహెచ్ఎంసీ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణను చేపట్టింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోడ్ వల్ల ఈ సారి కాస్తా ఆలస్యం కాగా ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా వేసవి క్రీడా శిబిరాలు అందుబాటులోకి వచ్చాయి. వేసవి క్రీడా శిక్షణ సామగ్రి సైతం ఆయా డివిజన్లకు చేరుకున్నాయి. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో అతిపెద్ద క్రీడా సౌధాలతో పాటు మైదానాలకు కొదువ లేదు. గ్రేటర్‌లో ఎక్కడా లేనివిధంగా అన్ని రకాల ఇండోర్, ఔట్ డోర్ గేమ్స్‌లో ఆయా చోట్ల శిక్షణ కొనసాగుతుంటుంది. సాధారణంగానే నిరంతర శిక్షణ ఉంటుంది. అయితే వేసవి సెలవుల దృష్ట్యా వాటి స్థానంలో శనివారం నుంచి మే 31 వరకు ప్రత్యేక శిక్షణ కొనసాగనుంది.

- ఎప్పటి లాగానే అమీర్‌పేట్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లతో పాటు వివిధ క్రీడా ప్రాంగణాలు వేసవి శిక్షణ శిబిరాలకు వేదికయ్యాయి.
- క్రికెట్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్కేటింగ్, షటిల్, జిమ్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్, హాకీ, యోగ, చెస్, కరాటే....ఇలా వివిధ రకాల క్రీడాంశాల్లో జీహెచ్ఎంసీ తరుపున శిక్షణ ఇస్తున్నారు.
- వేసవి శిక్షణ శిబిరాల ద్వారా కొనసాగే ఆటల్లో శిక్షణ పొందేందుకు 5 నుంచి 16 ఏళ్ళ మధ్య వయస్సున్న వారు అర్హులుగా నిర్ణయించారు. ఆసక్తి గల బాలబాలికలు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని జీహెచ్ఎంసీ క్రీడా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి తెలిపారు.
- వేసవి శిబిరాల్లో స్విమ్మింగ్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ మినహాయించి అన్ని క్రీడల్లో శిక్షణ పొందేందుకు రూ.10 ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవచ్చు. స్కేటింగ్, క్రికెట్‌లో మాత్రం వేసవి శిక్షణ కోసం రూ.50లు చెల్లించాల్సి ఉంటుంది. స్విమ్మింగ్ శిక్షణకు రూ.500లు చెల్లించాలి.
- వేసవి శిక్షణ శిబిరాలకు హాజరయ్యే బాలబాలికలు స్పోర్ట్స్.జీహెచ్ఎంసీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి పిల్లల పేరు, వివరాలు నమోదు చేసి, ఇష్టమైన క్రీడను ఎంపిక చేసుకుని సూచించిన ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతాయి.

స్కేటింగ్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.50, కోచ్: పవన్‌కుమార్
ఫోన్: 98665 13604

బాక్సింగ్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు ఫీజు: రూ.10,
కోచ్: ప్రకాశ్ ఫోన్: 93907 65412

జిమ్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.200, కోచ్: విక్రమ్
ఫోన్: 91772 85745

బ్యాడ్మింటన్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.50, కోచ్: సురేష్
ఫోన్: 99498 14362

హాకీ
వేదిక: అమీర్‌పేట్ క్రీడామైదానం
ఫీజు: రూ.10, కోచ్: దర్శన్‌సింగ్
ఫోన్: 98497 21703

కరాటే
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు ఫీజు: రూ.10,
కోచ్: బాబు ఫోన్: 96181 33057

జిమ్నాస్టిక్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట డీకేరోడ్డు ఫీజు: రూ.50,
కోచ్: మహేష్ ఫోన్: 90002 77716

యోగా
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.50, కోచ్: మనోజ్
ఫోన్: 99639 78509

హ్యాండ్‌బాల్
వేదిక: సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్
ఫీజు: రూ.10, కోచ్: ఇమ్రాన్‌ఖాన్
ఫోన్: 91772 39786

బాస్కెట్‌బాల్
వేదిక: సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీకాలనీ ఇమ్మానుయేల్ చర్చి సమీపంలోని గ్రౌండ్
ఫీజు: రూ.10
కోచ్: నయిముద్దీన్, ఫోన్: 98483 96922

వాలీబాల్
వేదిక: సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్
ఫీజు: రూ.10, కోచ్: చిన్ని, పెద్ది
ఫోన్ :99599 51499

క్రికెట్
వేదిక: సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్
ఫీజు: రూ.100, కోచ్: రాజ్‌కిరణ్
ఫోన్: 97041 59549

ముగిసిన బ్రహ్మకుమారీస్ వేసవి శిక్షణ శిబిరం

సనత్‌నగర్: బ్రాహ్మకుమారీస్ ఎస్సార్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రాజయోగ మెడిటేషన్ కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ప్రాణాయాం, యోగాసనాలు, బ్రెయిన్ బూస్టింగ్ యాక్టివిటీస్, మోరల్, ఇన్స్పిరేషనల్ స్టోరీస్ అండ్ వీడియోస్, మొబైల్ డెడికేషన్ సెషన్, పాజిటివ్ థింకింగ్ అండ్ అఫిర్మేషన్స్ ఫర్ సక్సెస్, ఫన్ గేమ్స్ వంటి అంశాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరి రోజు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు, ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు కల్పన, విద్య తదితరులు పాల్గొన్నారు.

జెక్‌కాలనీలో నేడు 'గ్రాండ్ మా' వేడుకలు

సనత్‌నగర్: జెక్‌కాలనీలో సోమవారం సాయంత్రం 4.30 గ్రాండ్ మా వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రభ అనంతరెడ్డి, ఎస్.అన్నపూర్ణలు తెలిపారు. వేడుకల్లో భాగంగా అమ్మమ్మలు, తాతయ్యలు ఒకే వేదికపై సందడి చేయనున్నారు. ఉమ్మడి కుటుంబాల్లో ఉండే మాధుర్యాన్ని కాలనీవాసులతో పంచుకోనున్నారు. ఈ సందర్భంగా అమ్మమ్మ, తాతయ్యలను ఘనంగా సన్మానించనున్నారు. అలాగే వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నారు.

బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ : పద్మారావు గౌడ్

బౌద్ధనగర్: రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించి 25 వసంతాల వేడుకలను జరుపుకుంటున్న ఏకైక ఉద్యమ పార్టీ భారత రాష్ట్ర సమితి పార్టీ అని మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎల్కతుర్తిలో జరుగుతున్న పార్టీ బహిరంగ సభకు తరలి వెళ్లే బస్సులను పద్మారావు గౌడ్ జెండా ఊపి ప్రారంబించారు. కార్పొరేటర్ కంది శైలజ నాయకులు కంది నారయణ, సుంకు రామ్‌చందర్, మంద జగన్, సుమలత, సుజాత పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్



చిలకలగూడలో ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సామల హేమ తదితరులు

సికింద్రాబాద్: లంగాణ రాష్ట్రం బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందని ఇక్కడి ప్రజలకు అన్ని విధాల న్యాయం జరగాలంటే మళ్లీ కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కావడం ఒక్కటే మార్గమని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ అన్నారు. ఆదివారం సీతాఫల్‌మండి, చిలకలగూడలోని వివిధ ప్రారంతాల్లో ఆయన పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన ఏడాదిన్నర కాలానికే రాష్ట్ర ప్రజలు పాలనను చూసి విచారం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వరంగల్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవసభ ద్వారా కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కార్యకర్తలతో కలిసి బస్సులో వరంగల్ సభకు తరలివెళ్లారు. సీతాఫల్‌మండి కార్పోరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ నాయకులు రామేశ్వర్‌గౌడ్, కరాటేరాజు, జీ.చంద్రశేఖర్, సుంకు రాంచందర్ పాల్గొన్నారు.

9వ రోజుకు చేరుకున్న అధ్యాపకుల సమ్మె



ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతోంది. ఆదివారానికి కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మెకు 9 రోజులు కాగా, ఐదు రోజులుగా పార్ట్‌టైం అధ్యాపకులు సమ్మె చేస్తున్నారు. అయినా ప్రభుత్వంగాని , యూనివర్సిటీల అధికారులుగాని పట్టించుకోకవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరించి ఆయా వర్సిటీల పాలన భవనాల ఎదుట సుమారు 2000 మంది అధ్యాపకులు సమ్మెలో పాల్గొనడంతో డిగ్రీ పరీక్షలపై తీవ్ర ప్రభావం పడింది.

పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా క్యాండిల్ మార్చ్



సనత్‌నగర్: పహల్గాం ఉగ్రదాడికి నిరసిస్తూ జెక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం క్యాండిల్ మార్చ్ నిర్వహించారు. ఉగ్ర దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో జెక్ కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌చందు, వెంకట్ సోమ, శివారెడ్డి, రామసుబ్బారెడ్డి, లింగంపల్లి నర్సింగరావు, కంజర్ల సదాశివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కంటోన్మెంట్: కోడలి వేధింపులు భరించలేక గత వారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన బోయిన్‌పల్లి బాపూజీనగర్‌కు చెందిన మహిళ నూనె సుశీల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. నూనె సుశీల అనే మహిళ గత 35 ఏళ్లుగా బాపూజీనగర్‌లో ఉంటోంది. కొంతకాలంగా సుశీలకు, కోడలకు మధ్య గొడవలు జరుగుతూ ఉన్నాయి. ఈ క్రమంలో గత మంగళవారం సుశీల సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి పెట్రోల్ తెచ్చుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. 90 శాతం గాయాల పాలైన ఆమెను ఆసుపత్రికి తరలించిన పోలీసులు, ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేసుకుని కేసు నమోదు చేసుకున్నారు. చికిత్స పొందుతూ సుశీల శనివారం మృతి చెందింది. ఆదివారం ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అక్రమ చొరబాటుదారులను గుర్తించండి




మహంకాళి ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

రాంగోపాల్‌పేట్: అక్రమంగా వలసవచ్చిన బంగ్లాదేశీయులను గుర్తించేందుకు ప్రత్యేక కార్డన్ సెర్చ్‌ను నిర్వహించాలని బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం మహంకాళి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమ చొరబాటుదారులతో దేశానికి ప్రమాదమని, వారు ఏమి చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా వారిని గుర్తించి వారి ఐడెంటీలను తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బీజేవైఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. బీజేవైఎం నగర ఉపాధ్యక్షుడు సంగాపురం భరత్‌రాజ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఇన్‌స్పెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

డెర్మటోసర్జరీకి పెరుగుతున్న ప్రాధాన్యం

రాంగోపాల్‌పేట్: డెర్మటాలజీ విభాగంలో డెర్మటోసర్జరీ అనే ఉప విభాగానికి ప్రాధాన్యం బాగా పెరుగుతోందని, ఈ విషయంలో నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకుంటేనే రోగులకు మరుగైన ఫలితాలను అందించగలమని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్ రావు అన్నారు. కిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం ఏసీఎస్ (ఐ)ఈసీ, అకాడమీ సమన్వయంతో డెర్మటోసర్జరీపై వైద్యుల కోసం వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో ప్రధానంగా కుట్లు వేసే టెక్నిక్‌లపై డెర్మటాలజిస్టులకు శిక్షణ ఇచ్చారు. భారత్, నేపాల్ దేశాల నుంచి సుమారు 300 మందికి పైగా డెర్మటాలజిస్టులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

ఉత్సాహంగా బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



తార్నాకలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతిహరి

లాలాపేట: భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) 25 సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను ఆదివారం తార్నాక మున్సిపల్ డివిజన్‌లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. లాలాపేట లేబర్ అడ్డా వద్ద, మాణికేశ్వర్‌నగర్ వద్ద తార్నాక మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతిహరి పార్టీ పతాకం గులాబి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు



సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రైల్వే పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాళ్లు, పార్సిల్ సర్వీస్ కార్యాలయాలు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో సోదాలు చేశారు. బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేశారు. ప్రయాణీల లగేజీలు, రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీఆర్ సారస్వత్, ఎస్ఐ బీ వేంకటన్‌రెడ్డి, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ నేతృత్వంలో పోలీసు బృందాలు తనిఖీల్లో పాల్గొన్నారు.



అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

భానుక నర్మదా



సంచారపురి కాలనీ 25వ వార్షికోత్సవంలో పాల్గొన్న బోర్డు సభ్యురాలు భానుక నర్మద సీఈఓ మధుకర్ నాయక్ తదితరులు

కంటోన్మెంట్: కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని కంటోన్మెంట్ బోర్డ్ సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ అన్నారు. ఒకటో వార్డు పరిధిలోని సంచారపురి కాలనీ 25వ వార్షికోత్సవంలో బోర్డు సీఈవో మధుకర్ నాయక్ తో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ముఖ్యంగా కాలనీ సంక్షేమ సంఘాలు బాధ్యతాయుతంగా వివరించడం వల్ల ఆయా కాలనీలో ఎంతో అభివృద్ధి చెందుతాయి అన్నారు. సంచారపురి కాలనీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ కాలనీకి ఎంపీ ఈటల రాజేందర్ ద్వారా రూ. 25 లక్షల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ , జక్కుల మహేశ్వర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు దివాకర్ ఉపాధ్యక్షులు రఘునాథ్ పాల్గొన్నారు.

గులాబీమయమైన బన్సీలాల్‌పేట్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాలు జెండాలు, తోరణాలతో గులాబీ మయంగా మారాయి. పద్మారావునగర్ ప్రధాన రహదారిలో బీఆర్ఎస్ ఇన్‌చార్జీ జి. పవన్‌కుమార్ గౌడ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం వరంగల్ బహిరంగసభకు తరలి వెళ్తున్న కార్యకర్తల ర్యాలీకి జెండా ఊపీ ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్‌రాజు, ఏసూరి మహేష్, వెంకటరమణ, మహేందర్ గౌడ్, పుష్యంత్‌రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద స్థానిక కార్పొరేటర్ కె. హేమలతలక్ష్మీపతి వేడుకల్లో పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు



బేగంపేటలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి..

సనత్‌నగర్: బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను ఆ పార్టీ శ్రేణులు సనత్‌నగర్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాయి. నియోజకవర్గంలోని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట డివిజన్ల వ్యాప్తంగా బీఆర్ఎస్ జెండాలను ఎగురవేశారు. తోరణాలు, జెండాలతో ఆయా ప్రాంతాలు గులాబీమయంగా మారాయి. బేగంపేటలో జరిగిన రజతోత్సవ సంబరాల్లో కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి హాజరై పార్టీ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీహరి, సురేష్ యాదవ్, రాజయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హీమోఫీలియాపై అవగాహన అవసరం



హీమోఫీలియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పంజగుట్ట: ప్రపంచంలో అన్ని దేశాలతో పోలిస్తే భారతదేశంలోనే హీమోఫీలియా బాధితులు ఎక్కువగా ఉన్నారని ప్రముఖ హెమటాలజీ వైద్య నిపుణులు విక్రమ్ కుమార్ అన్నారు. బాధితుల సంఖ్య నానాటికీ పెరగడం బాధాకరమన్నారు. ఆదివారం రాజ్‌భవన్ రోడ్డులోని అశ్విన్ ఆసుపత్రిలో హీమోఫిలియా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షులు చంద్రశేఖర్ రావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వ్యాధి బాధితులకు ఉచిత సేవలందించేందుకు ఏర్పాటు చేసిన హీమోఫిలియా ట్రీట్‌మెంట్ సెంటర్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా వ్యాధిగ్రస్తులకు తపాడియా డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులు ఉచిత నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విక్రమ్ కుమార్, చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ అత్యధునిక వైద్యం అందుబాటులోకి వస్తున్నప్పటికీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడం బాధాకరమన్నారు. పూర్తిగా వ్యాధి నయం కాకున్నా ఉపశమనం కలిగేందుకు ఆధునిక వైద్య చికిత్స, మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. శరీరంలో అంతర్గత రక్తస్రావం జరిగినప్పుడు ఫ్యాక్టర్ ఇంజెక్షన్‌తో పాటు రక్తస్రావం అవుతున్న చోట ఐస్ పెడుతుండాలని సూచించారు. ఫిజియో థెరపీ తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సీతాదేవి, రమణి, రాధేశ్యామ్, హేమంత్ కుమార్, వంశీ, రామారావు పాల్గొన్నారు.